


మన దునియా

Our News Our World

RNI Number
TELTEL/2023/85680

మన అక్షరం - మన ప్రపంచం



రిపోర్టర్లు కావలెను

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచనాలు సృష్టిస్తున్న
మన దునియా
మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది.
రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...
9490056011,9603969335 నంబర్లకు
వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



సంపుటి: 04 | సంచిక: 31 | మంగళవారం, అక్టోబర్ 06, 2026 | పేజీలు: 08 | వెల: రూ.4.00


## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల

# అభివృద్ధి పనులపై మంత్రుల సమీక్ష

- రెవెన్యూ, గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిపై చర్చ
- సమస్యల పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం
- ప్రజలకు మెరుగైన సేవలే ప్రభుత్వ లక్ష్యం

**నిర్మల్, అక్టోబర్ 5 మన దునియా ప్రతినిధి :**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో కొనసాగుతున్న రెవెన్యూ, గృహ నిర్మాణ కార్యక్రమాల అమలు, అభివృద్ధి పనుల పురోగతి, ప్రజా సమస్యల పరిష్కారంపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్‌లో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన కలెక్టర్లు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వివిధ అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో భూ పరిపాలన, రెవెన్యూ సమస్యల పరిష్కారం, భూముల రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేకంగా సమీక్ష చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రులు అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం లేకుండా పనిచేయాలని సూచించారు. గృహ నిర్మాణ కార్యక్రమాల అమలు, ముఖ్యంగా నిరుపేదలకు గృహాల కల్పనకు సంబంధించి చేపడుతున్న చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు.

## వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు

# వేగవంతం చేయాలి



- పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం
- నాణ్యత, సమన్వయానికి ప్రాధాన్యత
- ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబాటు - మంత్రి పొన్నం ప్రభాకర్



**రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 5 మన దునియా ప్రతినిధి :**

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి వేములవాడ ఆలయ అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని శాఖల వారీగా పరిశీలించి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సమీక్షలో ఇప్పటికే పూర్తయిన పనులు, ప్రస్తుతం కొనసాగుతున్న నిర్మాణాలు, పెండింగ్‌లో ఉన్న ప్రతిపాదనలపై విస్తృతంగా చర్చించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులను మరింత వేగవంతం చేయాలని సూచించారు.

వివరాలు 2లో

# సీఎంపై అసభ్య పోస్టుల వ్యవహారం

- సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు
- మార్ఫింగ్ చిత్రాలతో పోస్టు చేసినట్లు ఆరోపణ
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**హైదరాబాద్, అక్టోబర్ 05 మన దునియా ప్రతినిధి**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సినీ నటి సురేఖావాణిని కించపరిచేలా సామాజిక మాధ్యమాల్లో ప్రచురితమైన ఓ పోస్టు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ వ్యవహారంపై టీపీసీసీ సామాజిక మాధ్యమాల విభాగం రాష్ట్ర కార్యదర్శి, న్యాయవాది కైలాశ్ సజ్జన్ హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయిస్తూ అధికారిక ఫిర్యాదు చేశారు. ప్రజాప్రతినిధులు, మహిళల గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్న ఈ పోస్టుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఫిర్యాదు ప్రకారం 'డిగ్‌టీవీ తెలుగు (డిగ్‌టీవీ ప్యారడీ)' పేరుతో నడుస్తున్న ఒక ఎక్స్ ఖాతాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నటి సురేఖావాణి చిత్రాలను మార్ఫింగ్ చేసి అసభ్యకర వ్యాఖ్యలతో కూడిన పోస్టు ప్రచురించారని పేర్కొన్నారు.



## ఓటుకు నోటు కేసులో

# కొత్త మలుపు

- సుప్రీంకోర్టును ఆశ్రయించిన స్టీఫెన్‌సన్
- ఇంప్లీడ్ పిటిషన్‌తో విచారణకు ప్రాధాన్యత
- మరోసారి చర్చనీయాంశమైన 2015 కేసు



**న్యూఢిల్లీ, అక్టోబర్ 05**

**మన దునియా ప్రతినిధి :**

తెలుగు రాష్ట్రాల్లో ఒకప్పుడు సంచలనం సృష్టించిన ఓటుకు నోటు కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన ఫిర్యాదుదారుగా ఉన్న నామినేటెడ్ మాజీ ఎమ్మెల్యే ఎల్విస్ స్టీఫెన్‌సన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తన వాదనలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ ఆయన ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం రాజకీయ, న్యాయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో ఈ పిటిషన్ దాఖలు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్‌లో స్టీఫెన్‌సన్ తన వాదనలను నేరుగా వినిపించేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కేసులో ప్రధాన ఫిర్యాదుదారుగా ఉన్నందున తన అభిప్రాయాలు, వాదనలు కూడా విచారణలో భాగం కావాలని ఆయన అభ్యర్థించారు. నిష్పక్షపాత విచారణ కోసం తన పాత్రను గుర్తించాలని, కేసుకు సంబంధించిన కొన్ని కీలక అంశాలను ధర్మాసనం దృష్టికి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు నివేదించినట్లు సమాచారం.

వివరాలు 2లో



## స్విట్జర్లాండ్ అధ్యక్షుడికి రాష్ట్రపతి భవన్‌లో

# ఘన స్వాగతం

- భారత్ పర్యటనకు వచ్చిన గై పార్మెలిన్
- లాంఛనప్రాయ స్వాగతం పలికిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంపై దృష్టి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 మన దునియా ప్రతినిధి :**

స్విట్జర్లాండ్ సమాఖ్య అధ్యక్షుడు గై పార్మెలిన్‌కు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాష్ట్రపతి భవన్‌లో ఘన లాంఛనప్రాయ స్వాగతం పలికారు. భారత పర్యటనకు విచ్చేసిన స్విస్ అధ్యక్షుడికి సంప్రదాయబద్ధంగా గౌరవ వందనం సమర్పించి ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య స్నేహపూర్వక సంబంధాల ప్రాధాన్యం మరోసారి ప్రతిఫలించింది. రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించిన స్వాగత కార్యక్రమంలో భారత ప్రభుత్వం తరఫున పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ గౌరవ వందనాన్ని స్వీకరించి భారత సాయుధ దళాల దళాలను పరిశీలించారు. అనంతరం ఇరు దేశాల ప్రతినిధి బృందాల మధ్య పరస్పర పరిచయ కార్యక్రమం జరిగింది.

వివరాలు 2లో

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 06, 2026

# 22-ఏ నిషేధిత భూ సమస్యలపై సత్వరమే స్పందించాలి

అర్హులైన వారికి పూర్తిస్థాయిలో న్యాయం చేయాలి

రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదు

వారం రోజుల్లోపు అన్ని దరఖాస్తులను పరిష్కరించాలి

రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే, కలెక్టర్ సమీక్ష

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**



నిజామాబాద్, అక్టోబర్ 05 : 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులు, అర్జీలపై సత్వరమే స్పందించాలని ప్రభుత్వ సలహాదారు బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి సూచించారు. , కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి సోమవారం సాయంత్రం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రెవెన్యూ అధికారులు, అన్ని మండలాల తహసిల్దార్లతో రెవెన్యూ సంబంధిత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా 22-ఏ నిషేధిత భూములకు సంబంధించి దరఖాస్తుదారులను పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పుకోకూడదని అన్నారు. భూభారతి చట్టం మార్గదర్శకాలను పాటిస్తూ, రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అర్జీలను వెంటదివెంట పరిష్కరించాలని హితవు పలికారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దరఖాస్తుదారులు ఇబ్బందులు పడకూడదని, అర్హులకు పూర్తి న్యాయం జరిగేలా అధికారులు చొరవ చూపాలన్నారు. అన్ని దరఖాస్తులను వారం పది రోజుల్లోపు పరిష్కరించాలని స్పష్టమైన గడువు విధించారు. ఇదే తరహాలో భూభారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం విషయంలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించాలని, ప్రాధాన్యత క్రమంలో దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ చెరువుల శిఖం భూముల కబ్జాలను ఉపేక్షించకూడదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు స్పష్టం చేశారు. అవసరమైన చోట పకడ్బందీగా సర్వే నిర్వహించి, హద్దులను నిర్ధారిస్తూ ప్రభుత్వ భూములు, శిఖం భూములను పరిరక్షించాలని సూచించారు. రెవెన్యూ, అటవీ భూవివాదాల పరిష్కారానికి త్వరలోనే జాయింట్ సర్వే జరిపిస్తామని అన్నారు. కాగా, ఇసుక రవాణా





నిబంధనలకు అనుగుణంగా జరిగేలా క్షేత్రస్థాయిలో పకడ్బందీ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సాయంత్రం 5.00 గంటల తరువాత ఇసుక రవాణా చేస్తూ వాహనాలు తిరుగకూడదని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణాకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించిన ధాన్యం సేకరణ కోసం ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని అన్నారు. ఏ దశలోనూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ధాన్యం రవాణాకు వాహనాల కొరత ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. కాగా, డబుల్ బెడ్రూమ్ ఇళ్ళ కేటాయింపులో పారిశుధ్య కార్మికులకు ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇప్పటికే నిజామాబాద్, బోధన్ పట్టణాలలో వారికి రెండు పడక గదుల ఇళ్ళను కేటాయించడం జరిగిందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఆర్.ఓ గీత, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయకుమారి, అన్ని మండలాల తహసిల్దార్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# కాక వెంకటస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ ఘనంగా నిర్వహణ

**మన దునియా, అక్టోబర్ 05,మంచిర్యాల జిల్లా**

మందమర్రి సింగరేణి పార్క్ ముందు స్వర్గీయ జి. వెంకటస్వామి (కాక) విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మందమర్రి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మంద తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో భూమిపూజ కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ శుభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి హాజరై, భూమిపూజను నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల పక్షపాతి, పేదల పెన్నిధి కాక వెంకటస్వామి అందించిన సేవలను, మందమర్రి ప్రాంతానికి ఆయన చేసిన మేలును గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ (ఐ ఎన్ టీయూసీ), సేవాదళ్, మహిళా నాయకురాళ్లు, మైనార్టీ నాయకులు, ఎస్సీ సెల్ ప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.







# స్విట్జర్లాండ్ అధ్యక్షుడికి రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం

మొదటిపేజీ తరువాయి

భారత్, స్విట్జర్లాండ్ దేశాల మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న స్నేహపూర్వక సంబంధాలు వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక రంగాల్లో విస్తరించాయి. తాజా పర్యటన ద్వారా ఈ సంబంధాలు మరింత బలోపేతం కావచ్చని అధికారులు భావిస్తున్నారు. పరస్పర ప్రయోజనాలకు అనుగుణంగా సహకారాన్ని మరింత విస్తరించేందుకు ఇరు దేశాలు కృషి చేస్తున్నాయి. స్విస్ అధ్యక్షుడి పర్యటనలో భాగంగా వివిధ ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరగనున్నాయి. వాణిజ్య విస్తరణ, పారిశ్రామిక భాగస్వామ్యం, ఆవిష్కరణలు, సాంకేతిక అభివృద్ధి, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. ఇరు దేశాల మధ్య ఆర్థిక, దౌత్య సంబంధాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారించనున్నారు.ప్రపంచ ఆర్థిక, పర్యావరణ సవాళ్ల నేపథ్యంలో భారత్, స్విట్జర్లాండ్ పరస్పర సహకారం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అనుభవాల మార్పిడి, పెట్టుబడుల ప్రోత్సాహం, నూతన అవకాశాల అన్వేషణకు ఈ పర్యటన ఉపయోగపడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. స్విస్ అధ్యక్షుడు గై పార్మెలిన్ భారత పర్యటన ఇరు దేశాల మధ్య ఉన్న సుదీర్ఘ స్నేహబంధాన్ని మరింత



బలోపేతం చేయడంలో కీలక మైలురాయిగా నిలవనుంది. పరస్పర విశ్వాసం, సహకారంతో కొత్త రంగాల్లో భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు ఈ పర్యటన దోహదపడుతుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మొదటిపేజీ తరువాయి

# ఓటుకు నోటు కేసులో కొత్త మలుపు

ఈ ఇంప్లీడ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. పిటిషన్‌కు సంబంధించిన అంశాలను పరిశీలించిన అనంతరం తదుపరి విచారణను వాయిదా వేసింది. స్టీఫెన్‌సన్ వాదనలను విచారణలో భాగం చేయాలా లేదా అన్న అంశంపై కోర్టు భవిష్యత్తులో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ కేసు 2015 జూన్‌లో జరిగిన తెలంగాణ శాసనమండలి ఎన్నికల సందర్భంగా వెలుగులోకి వచ్చింది. అప్పట్లో ఒక అభ్యర్థికి అనుకూలంగా ఓటు వేయించేందుకు నగదు ప్రలోభం చూపారనే ఆరోపణలు తీవ్ర సంచలనం సృష్టించాయి. ఈ వ్యవహారంలో తెలంగాణ అవినీతి నిరోధక శాఖ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. నగదు స్వాధీనం చేసుకోవడం, ఆడియో, వీడియో ఆధారాలు వెలుగులోకి రావడం దేశవ్యాప్తంగా చర్చకు దారితీసింది. ఈ కేసులో నమోదైన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ ప్రస్తుత తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌పై విచారణ కొనసాగుతున్న సమయంలోనే స్టీఫెన్‌సన్ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేయడం విశేషంగా మారింది. దీంతో కేసు విచారణ మరింత ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇరు పక్షాల వాదనలు, చట్టపరమైన అంశాలు కోర్టు పరిశీలనలో ఉన్నాయి. తాజా పరిణామాలతో ఓటుకు నోటు కేసు మరోసారి ప్రజల దృష్టిని ఆకర్షిస్తోంది. రాజకీయంగా ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ కేసులో సుప్రీంకోర్టు తీసుకునే తదుపరి నిర్ణయంపై ఆసక్తి నెలకొంది. స్టీఫెన్‌సన్ పిటిషన్‌ను ధర్మాసనం ఏ విధంగా పరిగణనలోకి తీసుకుంటుందనే అంశం రానున్న రోజుల్లో కేసు భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశముందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి.

# వేములవాడ ఆలయ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

మొదటిపేజీ తరువాయి

ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. వేములవాడ తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా ఉన్నందున ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి వస్తున్న నేపథ్యంలో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తుల అనుభవాన్ని మరింత మెరుగుపరిచేలా ప్రణాళికాబద్ధంగా పనులు కొనసాగించాలని సూచించారు. ఆలయ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ఎట్టి పరిస్థితుల్లోనూ భంగం కలగకూడదని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణ పనులు, మౌలిక వసతుల కల్పన, రహదారులు, పారిశుధ్యం, తాగునీటి సదుపాయాలు వంటి అంశాల్లో సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. పనుల అమలులో జాప్యం చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రతి పనికి స్పష్టమైన గడువు నిర్ణయించి అమలు పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించాలని పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల అభిప్రాయాలు, భక్తుల అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమా అగర్వాల్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణీత గడువులో అన్ని కార్యక్రమాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# విశాఖ డేటా సెంటర్‌పై హైకోర్టులో అత్యవసర విచారణ

## రేపు మధ్యాహ్నం 3.30 గంటలకు తదుపరి విచారణ

**మన దునియా,అమరావతి,అక్టోబర్ 05**






విశాఖపట్నంలో ప్రతిపాదిత అదానీ డేటా సెంటర్ ప్రాజెక్టుకు సంబంధించిన పిటిషన్‌పై ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేసింది.విశాఖలో అదానీ ఇన్‌ఫ్రా ప్రతిపాదించిన భారీ డేటా సెంటర్ ప్రాజెక్టు కోసం సింహాచలం దేవస్థానం భూములను లీజుకు ఇవ్వడాన్ని, ప్రాజెక్టుకు మంజూరైన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ పర్యావరణవేత్త బొలిశెట్టి సత్యనారాయణ హైకోర్టును ఆశ్రయించారు.పిటిషనర్ తరఫున న్యాయవాది విరాగ్ గుప్తా వాదనలు వినిపిస్తూ.. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రాంతం వన్యప్రాణి అభయారణ్యం/రిజర్వ్ ఫారెస్ట్‌కు కేవలం 470 నుంచి 750 మీటర్ల దూరంలోనే ఉందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిబంధనల ప్రకారం అభయారణ్యానికి ఒక కిలోమీటర్ పరిధిలో నిర్మాణాలకు అనుమతి ఉండదని, ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అనుమతులు తప్పనిసరి అని పేర్కొన్నారు.అయితే రాష్ట్ర ప్రభుత్వం 2026 ఫిబ్రవరి 27న జారీ చేసిన +.ా. చీశీ.4 ద్వారా నిబంధనలను సడలించి, సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇచ్చిందని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. భారీ స్థాయి డేటా సెంటర్ ప్రాజెక్టును సాధారణ 'బిల్డింగ్ ప్రాజెక్టు'గా చూపించి అనుమతులు పొందారని ఆరోపించారు.ఈ ప్రాజెక్టు విశాఖ నగర తాగునీటి రిజర్వాయర్లు, క్యాచ్‌మెంట్ ప్రాంతాలు, భూగర్భ జల వనరులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని పిటిషనర్ తరఫు న్యాయవాది ఆందోళన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సరైన రిజిస్టర్డ్ లీజ్ డీడ్ లేకుండానే సబ్-లీజ్ ద్వారా భూమిని అప్పగించడంపైనా ప్రశ్నలు లేవనెత్తారు.

**ప్రభుత్వం తరపున వాదనలు**

ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ వాదిస్తూ.. ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతులు 2026 జూన్ 10 నాటికే మంజూరయ్యాయని తెలిపారు. అన్ని అంశాలను పరిశీలించిన అనంతరం +.ా. చీశీ.4 ద్వారా అవసరమైన సడలింపులు ఇచ్చినట్లు కోర్టుకు వివరించారు.ఇదే అంశంపై మరో వ్యక్తి జాతీయ హరిత ట్రైబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారని, ఆ కేసు ఎల్లుండి విచారణకు రానుందని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ దాఖలు చేసిన రిజాయిండర్, ప్రభుత్వ ఉత్తర్వులు, ఇతర సంబంధిత రికార్డులను పరిశీలించాల్సి ఉందని పేర్కొంది. దీంతో కేసు విచారణను మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు వాయిదా వేసింది.

మన దునియా
Our News Our World
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 06, 2026

# లైంగిక దాడుల ఘటనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**మన దునియా,న్యూఢిల్లీ,అక్టోబర్ 05**

దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న లైంగిక దాడుల ఘటనలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. లైంగిక నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారి మనసుల్లో తీవ్రమైన 'భయం' కలిగించాలని సుప్రీంకోర్టు ఢిల్లీ పోలీసులకు సూచించింది. విద్యార్థినులను వేధించే 'అల్లరి మూకలు' తిరిగే కళాశాలలపై దృష్టి సారించాలని కోర్టు పోలీసులను ఆదేశించింది. ఆ తర్వాత, ఢిల్లీ వ్యాప్తంగా అసాంఘిక శక్తులు గుమిగూడి మద్యం సేవించే వేలాది అక్రమ ఆహార విక్రయ కేంద్రాలపై దృష్టి పెట్టాలని సుప్రీంకోర్టు పేర్కొంది. సోమవారం దక్షిణ ఢిల్లీలోని ఒక బాలికల కళాశాలకు కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పార్కులో జరిగిన సామూహిక అత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు..సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ తరహా ఘటనలపై చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై ఢిల్లీ పోలీసులను ప్రశ్నించింది."



# ఆరు నెలల ఇంచార్జ్.. ఏళ్లుగా అదే పాలన! కామనపల్లి రేషన్ షాప్‌కు వెంటనే నోటిఫికేషన్ ఇవ్వాలి ఎస్సీ రిజర్వేషన్ అమలు చేయాలని గ్రామస్థుల డిమాండ్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా; అక్టోబర్ 05:**




మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కామనపల్లి గ్రామంలోని రేషన్ దుకాణం నిర్వహణపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాత్కాలిక ప్రాతిపదికన ఇంచార్జ్‌లకు అప్పగించిన రేషన్ షాప్‌ను అదే విధంగా కొనసాగించకుండా, నిబంధనల ప్రకారం కొత్త నోటిఫికేషన్ జారీ చేసి అర్హులైన వారికి అవకాశం కల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కామనపల్లి రేషన్ దుకాణం ఎస్సీ కేటగిరీకి కేటాయించబడిందని గ్రామస్థులు తెలిపారు. షాప్ ఖాళీ అయిన సమయంలో ఆరు నెలల తాత్కాలిక కాలపరిమితితో డ్వాక్రా మహిళలకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించారని, అయితే ఆ గడువు ముగిసి చాలాకాలం గడిచినా ఇప్పటివరకు కొత్త నోటిఫికేషన్ విడుదల కాలేదని పేర్కొన్నారు. 40 శాతానికి పైగా ఎస్సీ జనాభా కామనపల్లి గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన ప్రజలు 40 శాతానికి పైగా ఉన్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గత రిజర్వేషన్ రోస్టర్, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రేషన్ షాప్ కేటాయింపుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని కోరుతున్నారు. నోటిఫికేషన్ ఆలస్యం కారణంగా అర్హులైన ఎస్సీ వర్గానికి చెందిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశం దూరమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

**అధికారులు తక్షణమే స్పందించాలి**

ఈ సమస్యపై మంచిర్యాల జిల్లా కలెక్టర్, ఆర్డీఓ, జన్నారం తహసీల్దార్ వెంటనే స్పందించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. ఇంచార్జ్ విధానాన్ని కొనసాగించకుండా, రేషన్ షాప్‌కు సంబంధించి వెంటనే నోటిఫికేషన్ జారీ చేసి రిజర్వేషన్ నిబంధనల ప్రకారం నియామక ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్‌పై అధికారులు స్పందించకపోతే జన్నారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని గ్రామస్థులు హెచ్చరించారు. సమస్యను అధికారులు సత్వరమే పరిష్కరించి అర్హులైన వారికి న్యాయం చేయాలని కోరారు.

# ఉగ్రవాదులకు నిధులు సమకూర్చారంటూ వృద్ధుడికి బెదిరింపులు.. లక్షల్లో వసూలు

**మన దునియా,హైదరాబాద్,అక్టోబర్ 05**

ఉగ్రవాదులకు నిధులు సమకూర్చారంటూ వృద్ధుడిని బెదిరించి.. లక్షల్లో డబ్బులు వసూలు చేసిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. షేట్‌బషీర్‌బాద్‌కు చెందిన 72 ఏళ్ల వృద్ధుడిని సైబర్ నేరగాళ్లు దారుణంగా మోసం చేశారు. ముంబై పోలీస్ అధికారులమంటూ సదరు వృద్ధుడికి సైబర్ కేటుగాళ్లు ఫోన్ చేశారు. రూ.2 కోట్లు ఉగ్రవాద సంస్థలకు సమకూర్చారంటూ బెదిరింపులకు దిగారు. మనీలాండరింగ్ కేసు నమోదైందంటూ భయపెట్టారు. వీడియో కాల్ చేసి ఓ సీనియర్ పోలీస్ అధికారినంటూ మరో వ్యక్తిని వృద్ధుడికి పరిచయం చేశారు. అంతేకాకుండా విషయం ఎవరికైనా చెబితే కుటుంబసభ్యులను కూడా కేసులో ఇరికిస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. కేసు నుంచి తప్పించేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. కేసు విషయంలో భయాందోళనకు గురైన వృద్ధుడు.. డబ్బులు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. దీంతో బాధితుడి నుంచి విడతల వారీగా డబ్బులు వసూలు చేశారు. దాదాపు రూ.55.20 లక్షలు కాజేశారు. చివరకు మోసాన్ని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. వృద్ధుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి విషయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపోవద్దని సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు..



# డ్రగ్స్ రహిత సమాజం కోసం మరో ముందడుగు

**డీజీపీ సీవీ ఆనంద్ చేతుల మీదుగా డా. సామ రవీందర్ రెడ్డి రచించిన 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకావిష్కరణ**

**మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం - డీజీపీ సీవీ ఆనంద్**

**మన దునియా,హైదరాబాద్:అక్టోబర్ 05**

మాదకద్రవ్యాల దుర్వినియోగం, దాని దుష్పరిణామాలు, నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో రాజేంద్రనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకుడు డా. సామ రవీందర్ రెడ్డి రచించిన 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనలో సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అన్నారు. తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు ప్రభుత్వం, పోలీసుశాఖ చర్యలు తీసుకుంటున్నాయని తెలిపారు. పోలీసుశాఖ, ఈగల్ ఫోర్స్ చర్యలతో పాటు ప్రజల భాగస్వామ్యం, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం కూడా అత్యంత అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం ఒక వ్యక్తి జీవితానికే పరిమితం కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని డీజీపీ అన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడిన తర్వాత నివారణ చర్యలు చేపట్టడం కంటే, ముందుగానే అవగాహన కల్పించడం మరింత ముఖ్యమని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా విద్యాసంస్థలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, స్వచ్ఛంద సంస్థలు, యువత సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో యువత, విద్యార్థులతో పాటు మహిళలు, చిన్నారులకు కూడా మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ ఏ రూపంలో ఉన్నా వాటి నియంత్రణకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా డా. సామ రవీందర్ రెడ్డిని డీజీపీ సీవీ ఆనంద్ అభినందించారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సమస్యలపై స్పందిస్తూ విద్యార్థులు, ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. డా. సామ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పుస్తకావిష్కరణతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. 'మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా' పుస్తకం తెలంగాణలోని విద్యాసంస్థలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన పుస్తకంగా రూపొందించామని తెలిపారు. పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ క్యాంపస్‌లలో మాదకద్రవ్యాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను ఇందులో సమగ్రంగా వివరించినట్లు చెప్పారు. విద్యార్థులు, యువత తప్పనిసరిగా చదవాల్సిన విధంగా పుస్తకాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు."మంచి జీవితం కోసం మత్తుకు దూరంగా ఉండాలంటే ముందుగా అవగాహన అవసరం. మత్తుకు అలవాటు పడిన తర్వాత నిర్మూలన చర్యల కంటే ముందుగానే నివారణకు కృషి చేయడం ఎంతో ముఖ్యం" అని డా. రవీందర్ రెడ్డి అన్నారు."మన చదువు మన కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఉపయోగపడాలి" అనే ఆలోచనతో ఒకవైపు విద్యార్థుల విద్యా అవసరాలకు ఉపయోగపడే పుస్తకాలను, మరోవైపు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించే పుస్తకాలను రచిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ పోలీసుశాఖ అవకాశం కల్పిస్తే రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కార్యక్రమాల్లో తన వంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు.ఈ పుస్తకానికి తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, ఐఏఎస్, తెలంగాణ ఈగల్ ఫోర్స్ డైరెక్టర్ సీనియర్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య ముందుమాటలు రాసినందుకు డా. రవీందర్ రెడ్డి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ అంజిరెడ్డి, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకుల రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డా. కె. సురేందర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందు, పోలీసుశాఖ, ఎక్సైజ్ శాఖ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని డా. సామ రవీందర్ రెడ్డిని అభినందించారు..




# ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం ప్రజాదివాస్‌లో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్.





**మన దునియా,భూపాలపల్లి జిల్లా:అక్టోబర్ 05**

భూపాలపల్లి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి మొత్తం 18 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి, సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, సంబంధిత అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జిల్లా ఎస్పీ తెలిపారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో భారీగా బంగారం పట్టివేత

**మన దునియా,హైదరాబాద్,అక్టోబర్ 05**

శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఓ ప్రయాణికుడి నుంచి భారీగా బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతడిని డీఆర్ఐ అధికారులకు అప్పగించారు. ఆ ప్రయాణికుడిని వారు ప్రశ్నిస్తున్నారు. సోమవారం ఉదయం తిరుచిరాపల్లి నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న ప్రయాణికుడిని కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అతడి వద్ద బంగారం ఉన్నట్లు గుర్తించారు. దాదాపు 800 గ్రాముల బంగారాన్ని అతడి వద్ద నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. దీని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని కస్టమ్స్ అధికారులు వివరించారు..



# టైగర్‌జోన్ పేరుతో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

## జనసేన పార్లమెంట్ కో-ఆర్డినేటర్ డా. చుంచు రాజ్ కిరణ్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా;అక్టోబర్ 05:**

జన్నారం: కవ్వాల్ టైగర్‌జోన్ పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేయొద్దని జనసేన పార్టీ పెద్దపల్లి, ఆదిలాబాద్ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ డా. చుంచు రాజ్ కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రీరాముల భూమాచారి చేపట్టిన నిరవధిక దీక్ష 43వ రోజుకు చేరిన సందర్భంగా, ఆయన దీక్షకు జనసేన నాయకులతో కలిసి డా. చుంచు రాజ్ కిరణ్ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టైగర్‌జోన్, ఎకో సెన్సిటివ్ జోన్ నిబంధనల కారణంగా అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న సామాన్య ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి సారించి ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని 10 కిలోమీటర్లు తగ్గించి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. 43 రోజులుగా నిరవధిక దీక్ష కొనసాగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.అనంతరం మురిమడుగు గ్రామంలోని సత్యసాయినగర్ ఎస్సీ కాలనీని సందర్శించిన డా. రాజ్ కిరణ్ స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దళితుల ఇళ్లకు సమీపంలో అటవీశాఖ అధికారులు కందకాలు తవ్వడం సరికాదని అన్నారు. కందకాల కారణంగా ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడితే అందుకు సంబంధిత అటవీశాఖ అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇళ్లకు సమీపంలో తవ్విన కందకాలపై అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే జనసేన పార్టీ ఆధ్వర్యంలో ప్రజల పక్షాన పెద్దఎత్తున ఉద్యమాలు చేపడతామని డా. చుంచు రాజ్ కిరణ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా నాయకులు ఆవుల సాగర్, ఎం. పవన్ కళ్యాణ్, ఏ. చరణ్, మండల నాయకులు మూగల వెంకటేష్, బి. రాజ్ వెంకట్, బి. రాజేందర్, సంజీవ్, టి. బద్రి, సురేష్ గౌడ్,



స్వరాజ్, సిద్ధార్థ, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

# 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భూపాలపల్లి ఏఆర్ మహిళా కానిస్టేబుళ్ల సత్తా

**మన దునియా,భూపాలపల్లి జిల్లా,అక్టోబర్ 05**

తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో సెప్టెంబర్ 27 నుంచి 30 వరకు నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో భూపాలపల్లి జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు అఖిల, చరిష్మా, ప్రతిభ కనబరిచారు. టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో రెండు రజత పతకాలు సాధించి భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖకు గుర్తింపు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన ఏఆర్ మహిళా కానిస్టేబుళ్లు సోమవారం జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. వారు సాధించిన పతకాలను పరిశీలించిన ఎస్పీ క్రీడాకారులను అభినందించి వారి ప్రతిభను ప్రశంసించారు. పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి జిల్లా పోలీస్ శాఖకు పేరు తీసుకురావడం అభినందనీయమని ఎస్పీ గారు పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు శారీరక దారుఢ్యం, క్రీడా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సిబ్బందికి సూచించారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఎస్పీ గారు క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐ కాశీరాం పాల్గొన్నారు.



# వరంగల్ కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం

## భూ వివాదంపై అధికారుల నిర్లక్ష్యమంటూ గట్ల సురేందర్ ఆవేదన

**మన దునియా,వరంగల్ జిల్లా:అక్టోబర్ 05**

భూ వివాదం పరిష్కారం కోసం ఎన్నిసార్లు అధికారులను ఆశ్రయించినా న్యాయం జరగలేదని ఆరోపిస్తూ గట్ల సురేందర్ వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది.గట్ల సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన సోదరుడు గట్ల రాజు, ద్యాగల కొమురయ్య సంతకాన్ని ఫోర్జరీ చేసి 2003లో భూమిని కబ్జా చేశాడని ఆరోపించారు. అప్పటి నుంచి భూమి విషయంలో న్యాయం కోసం పలుమార్లు అధికారులను కలిసి ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని వాపోయారు.తన సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదనే మనస్తాపంతో సోమవారం వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చిన సురేందర్ పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించినట్లు సమాచారం. అప్రమత్తమైన అక్కడి సిబ్బంది వెంటనే అడ్డుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. 2003 నుంచి కొనసాగుతున్న భూ వివాదంభూమికి సంబంధించిన పత్రాలు, సంతకాల ఫోర్జరీపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని సురేందర్ కోరుతున్నారు.



# ఉచిత శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన జిల్లా ఎస్పీ కష్టపడితే విజయం తప్పక వరిస్తుంది

బంగారు భవిష్యత్తు కోసం అభ్యర్థులు నిత్యం శ్రమించాలి

నిరుద్యోగుల కోసం ములుగు జిల్లా అడ్మినిస్ట్రేషన్ నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ

శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్

**మన దునియా ములుగు జిల్లా అక్టోబర్ 05**



ములుగు జిల్లాలో మంత్రి సీతక్క మరియు జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్ఖడే గార్ల సహకారంతో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ తరగతుల కేంద్రాన్ని ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకాన్ ఐపీఎస్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శిక్షణ అభ్యర్థులతో మాట్లాడుతూ శిక్షణ తరగతులు జరుగుతున్న తీరును, అదేవిధంగా శిక్షణ ఏర్పాట్లలో ఏవైనా లోటుపాట్లు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ములుగు జిల్లా పూర్తిగా గ్రామీణ ప్రాంతమని, ఈ జిల్లాలోని పేద అభ్యర్థులు పట్టణ ప్రాంతంలో శిక్షణ కోసం వెళ్లడం ఎంతో ఖర్చుతో కూడుకున్నదని అందువలన ఈ జిల్లా అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఇబ్బందులు పడకూడదన్న సదుద్దేశంతో మంత్రి సీతక్క, ములుగు జిల్లా కలెక్టర్, గార్లతో సమన్వయం చేసుకుంటూ జిల్లా పోలీస్ శాఖ భోజన వసతులతో కూడిన ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నదని, కావున జిల్లాలోని అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. శిక్షణ అభ్యర్థులు తమ బంగారు భవిష్యత్తు కోసం ఇప్పుడు కష్టపడితే తప్పక వారి కల సాకారం అవుతుందని తెలియజేశారు. అదేవిధంగా ఈ శిక్షణ తరగతులు కేవలం ప్రిలిమ్స్ పరీక్ష వరకే కాకుండా మెయిన్స్ పరీక్షలు నిర్వహించే వరకు నిర్వహిస్తామని అభ్యర్థులకు చివరి వరకు తోడుగా ఉంటామని భరోసానిచ్చారు. ఈ జిల్లా నిరుద్యోగ అభ్యర్థులు కచ్చితంగా కష్టపడి జాబ్ సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం అధికారులతో కలిసి అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పి రవీందర్ ఎస్బి ఇన్స్పెక్టర్ ప్రతాప్ ములుగు సిఐ సురేష్ ఆర్ ఐ స్వామి, విశ్వ కోచింగ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ విశ్వనాథ్, ఎస్సై లు ఆర్ ఎస్ ఐ లు మరియు సిబ్బంది మరియు శిక్షణ అభ్యర్థులు పాల్గొన్నారు

# అఖిలపక్షం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో - భీంగల్ లో ఉద్రిక్త వాతావరణం

## రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

నిజామాబాద్ జిల్లా భీంగల్,పోలీసుల వేధింపులకు భయపడి పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన పొలాస సుధాకర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బి ఆర్‌ఎస్ కాంగ్రెస్ బిజెపి, ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులు, సంఘం సభ్యులతో కలిసి సోమవారం ఆందోళన చేపట్టారు.సుధాకర్ ఆత్మహత్యాయత్నం ఘటన అనంతరం బాధిత కుటుంబ సభ్యులతో పాటు సంఘం సభ్యులు పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీస్ స్టేషన్ గేట్ ఎదుట బైఠాయించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, ఆందోళనకారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఏఎస్ఐ సత్తార్ తమను రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ఆందోళనకారులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో నిర్వహించారు.బాధితుడి కుటుంబానికి న్యాయం చేయడంతో పాటు ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దీంతో ప్రధాన రోడ్డుపై కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబం చేసిన ఆరోపణలపై పోలీసుల వివరణ, అధికారికంగా నమోదైన కేసు వివరాలు తెలియాల్సి ఉంది.




# ప్రజావాణిలో నమోదైన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**



ప్రజావాణిలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి భుజంగరావు అధికారులకు సూచించారు. ప్రజావాణి లో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ వి భుజంగరావు అధికారులకు సూచించారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.ప్రజా వాణి కంప్లైంట్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 107 ఫిర్యాదులు అందాయని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్ రావు, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్‌లు స్వీకరించారు. ప్రజా వాణి కంప్లైంట్స్ ఆర్టీఐ చట్టంపై విస్తృతస్థాయిలో అవగాహన..సమాచార హక్కు చట్టం వారోత్సవాలను పురస్కరించుకుని ప్రజలకు జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు సూచించారు. ప్రజావాణి అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈనెల 5 నుండి 12వ తేదీ వరకు ఆర్టీఐ వారోత్సవాలను అన్ని స్థాయిలలో నిర్వహిస్తూ, సమాచార హక్కు చట్టం పట్ల ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భీమ్‌గల్ ఘటనలో పోలీసుల తప్పు లేదు సీపీ సాయిచైతన్య

## భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు.

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**




భీమ్‌గల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం ఉదయం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. అయితే ఆ ఘటనలో పోలీసుల తప్పేమి లేదని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు వివరాలు వెల్లడించారు. భీంగల్ పోలీస్ ఇన్సిడెంట్ పెట్టి కేసు పెట్టినందువల్లే..భీమ్‌గల్ పట్టణవాసి సుధాకర్ బస్టాండ్ సమీపంలో టీ స్టాల్ నడుపుతున్నాడు. అయితే అతడి షాప్‌కు ఎదురుగా ఉన్న కిరాణాషాప్‌లో సుధాకర్ సిగరెట్లు కొనడం లేదని.. ఆ షాప్ యజమాని ఇద్దరు విలేకరులను పంపించి ఆయనను బెదిరించారన్నారు. అలాగే సుధాకర్ టీస్టాల్ రాత్రి 10.30 తర్వాత కూడా తెరిచి ఉండడంతో పోలీసులు సాధారణ తనిఖీల్లో భాగంగా చూసి పెట్టికేసు పెట్టినట్లు సీపీ తెలిపారు. విలేకరులు బెదిరించిన అంశాన్ని మనసులో పెట్టుకున్న సుధాకర్ సోమవారం ఉదయం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఆవరణలో నిప్పంటించుకోవడం జరిగిందని పోలీస్ కమిషనర్ వివరించారు. ఈ విషయంలో పోలీసు వ్యవస్థకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
Our News Our World
మన అక్షరం - మన ప్రపంచం



# ఫ్యామిలీ డే, సద్దుల బతుకమ్మ, రామలీల వేడుకల ఏర్పాట్లపై జీఎం సమీక్షా సమావేశం

**మన దునియా, అక్టోబర్ 05,మంచిర్యాల జిల్లా**

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఫ్యామిలీ డే ఆట పాట, సద్దుల బతుకమ్మ రామలీల ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహించడానికి ఉన్నతాధికారులు, గుర్తింపు సంఘాల నాయకులతో ఏరియా జనరల్ మేనేజర్ ఎస్. రాధాకృష్ణ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ఈ ఉత్సవాలన్నీ అత్యంత వైభవంగా, విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అన్ని కేంద్రాల్లో విద్యుత్ దీపాల అలంకరణ (లైటింగ్ డెకరేషన్స్) శోభాయమానంగా ఏర్పాటు చేయాలని సూచించారు.సద్దుల బతుకమ్మ పండుగ రోజున బతుకమ్మ ఆడటానికి వచ్చే మహిళలకు, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.రామకృష్ణపూర్ ఠాగూర్ స్టేడియం గ్రౌండ్,మందమర్రి సింగరేణి హైస్కూల్ గ్రౌండ్,సోమగూడెం గ్రౌండ్బెల్లంపల్లి ఏఎంసీ గ్రౌండ్ అన్ని మైదానాలను ముందుగానే శుభ్రం చేసి, పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.అలాగే దసరా ఉత్సవాల సందర్భంగా నిర్వహించే రామలీల కార్యక్రమాన్ని కూడా ఎంతో ఘనంగా జరిపేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కోరారు.ఈ సమీక్షా సమావేశంలో ఎస్ ఓ టు జి ఎం,జి.ఎల్. ప్రసాద్, మందమర్రి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ, బెల్లంపల్లి ఏఐటియుసి బ్రాంచ్ సెక్రటరీ, దాగం మల్లేష్, రామకృష్ణాపూర్ ఏఐటియుసి సెక్రటరీ, అక్బర్ అలీ, డీజీఎం (పర్సనల్) సిహెచ్.అశోక్, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్ వి ఎస్ ఆర్ కె.ప్రసాద్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ మురళి, డీజీఎం సివిల్ మదీనా భాష, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ (ఎస్ అండ్ పి సి) వెంకటేశ్వర రెడ్డి, వర్క్ షాప్ ఎస్ ఈ) నరేష్, సీనియర్ పి ఓ సత్యనారాయ పాల్గొన్నారు.




# అఖిలపక్షం ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రాస్తారోకో

- భీంగల్ లో ఉద్రిక్త వాతావరణం రోడ్డుపై బైఠాయించిన కుటుంబ సభ్యులు.










**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

భీమ్‌గల్‌లో పోలీసు స్టేషన్ ఆవరణలో ఓ చిరు హోటల్ నిర్వాహకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు, ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించిన ఘటన చోటుచేసుకుంది. భీమ్‌గల్ బస్టాండ్‌లో హోటల్ నిర్వహిస్తున్న పొలాస సుధాకర్‌ను లేట్‌నైట్ వరకు హోటల్ నడుపుతున్నారంటూ పోలీసులు పలుమార్లు ప్రశ్నించి, జరిమానాలు విధించినట్లు ఆయన ఆరోపించారు.ఇప్పటికే తనపై మూడుసార్లు ఫైన్ విధించారని సుధాకర్ తెలిపారు. తాజాగా జరిమానా విధించిన పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సంతకం చేయాలని, కోర్టుకు వెళ్లి ఫైన్ కట్టి రావాలని ఆదేశించినట్లు చెప్పారు. తాను చిరు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నానని, తనను మాత్రమే లక్ష్యంగా చేసుకుని పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని మిగతా వాళ్లు షాపులు నడిపిస్తున్న వాళ్లను వదిలేసి కేవలం వ్యక్తిగతంగా తననే టార్గెట్ చేసి పోలీసులు వేధిస్తున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.తాను నిర్వహిస్తున్న హోటల్‌తో పాటు ఇతర దుకాణాలు కూడా తెరిచి ఉన్నప్పటికీ, తనను మాత్రమే ఎందుకు ప్రశ్నిస్తున్నారని సుధాకర్ ప్రశ్నించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం సుమారు 10 గంటల సమయంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల వేధింపుల కారణంగానే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు బాధితుడు చెప్తున్నాడు బాధితుడి ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి, వాస్తవ పరిస్థితులను వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. వేధింపులకు పాల్పడ్డ ఎస్సై కానిస్టేబుల్ తిరుపతి పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ భీంగల్ పోలీస్ స్టేషన్ ముందు సుధాకర్ కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు ధర్నా నిర్వహిస్తున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు..!

# బాల్కొండ పోలీసులు తీరు మార్చుకోవాలి: ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టీస్టాల్ యజమాని ఆత్మహత్యాయత్నం చేయడం బాధాకరమని లిఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**



భీమ్‌గల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో టీస్టాల్ యజమాని ఆత్మహత్యాయత్నం చేయడం అత్యంత బాధాకరమని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం మాట్లాడారు.బాల్కొండ పోలీస్ అల్లేగేషన్స్ ఇసుక వ్యాపారులతో ఎస్సై కుమ్మక్కు స్థానిక ఎస్సై వేధింపులు తాళలేక ఆత్మహత్యాయత్నం చేయడం విచారకరమని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం నిజామాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడుతున్న సుధాకర్‌కు ప్రభుత్వం పూర్తి ఖర్చులతో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. భీమ్‌గల్ ఎస్సై ఇసుక వ్యాపారులతో కుమ్మక్కై భారీగా మామూళ్లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. సామాన్య ప్రజలను తీవ్ర భయాందోళనలకు గురిచేయడం ఆయనకు పరిపాటిగా మారిందని వేముల అన్నారు. బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని భీమ్‌గల్ ఎస్సైతో పాటు బాల్కొండ, మోర్తాడ్ ఎస్సైలు కూడా ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్నారు. నిరుపేదలను, దళిత వర్గాల వారిని అకారణంగా వేధింపులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. బాల్కొండ నియోజకవర్గంలో ముగ్గురు ఎస్సైల అక్రమాలు, దౌర్జన్యాలు, వేధింపుల వ్యవహారంపై గతంలోనే సీపీ సాయి చైతన్య. దృష్టికి తీసుకెళ్లామన్నారు.

# ఘనంగా కాకా వెంకటస్వామి 97వ జయంతి వేడుకలు

**మన దునియా, అక్టోబర్ 05,మంచిర్యాల జిల్లా**



మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామంలో కాకా వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాకా వెంకటస్వామి జయంతి సందర్భంగా చిత్ర పటానికి మందమర్రి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కదారి జీవన్ కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి కేక్ కటింగ్ నివాళు లర్పించారు.కార్యక్రమానంతరం వారుమాట్లాడుతూ కార్మికుల చెమట చుక్కలోనే దేశ ప్రగతి దాగి ఉంది. వారి హక్కులను కాలరాసే హక్కు ఎవరికీ లేదు.“ అని చెప్పి కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలు చేపట్టి రాజకీయాలు అంటే పదవులు అనుభవించడం కాదు, అణగారిన వర్గాలకు అండగా నిలబడడం.. అణగారిన వర్గాల పిల్లలకు చదువే అసలైన ఆయుధం.. విద్య ద్వారానే సామాజిక మార్పు సాధ్యమవుతుంది.“అని భావించి సొంతంగా అంబేద్కర్ పేరు మీదుగా విద్యా సంస్థలను స్థాపించి ఎంతో మంది విద్యావేత్తలను అందిస్తూ,తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం ఢిల్లీ పీఠాల కంటే గొప్పదని ..మన హక్కుల కోసం పోరాటం ఆగకూడదు..అని తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మహనీయుడని... మరి ఢిల్లీలోనే కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తన సొంత భవనాన్ని ఇచ్చినటువంటి గొప్ప నాయకుడని.. అలాగే హైదరాబాదు చుట్టుపక్క ప్రాంతాల్లో 75 వేల నుండి 80 వేల గుడిసెలను వేయించిన మహనీయుడు కొనియాడారు...స్వర్గీయ గడ్డం వెంకటస్వామి ( కాక ) జయంతి సందర్భంగా వారికి ఘన నివాళులర్పిస్తున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండలం ఉపాధ్యక్షులు మాసు సంతోష్ కుమార్,సుమలత, ఎస్సీ సెల్ అధ్యక్షుడు వేల్పుల శంకర్, మండల్ సెక్రటరీ నర్సింగోజు తిరుపతి,మండల జనరల్ సెక్రటరీ ఆకుల అంజి, మండల స్పోక్స్ పర్సన్ ఎగుడా రాజమల్లు, మండల సర్పంచులు, బచ్చలి రాములు, పెరమండ్ల వెంకటేష్, రామ టెంకి తిరుపతి లతా, సెగ్గం వెంకటేష్, మాజీ సర్పంచులు,కమలమనోహర్ రావు, అసంపల్లి రాజయ్య , గోదారి రాజేష్,.కాంగ్రెస్ పార్టీ నాయకులు కొట్టే సంపత్,వేల్పుల చిరంజీవి కాపురపు సతీష్. గోసికే వినయ్ కుమార్.నీలం రవి,మనోహర్,శనిగరం కార్తీక్,రవీందర్.యాదగిరి మల్లేష్,తాజ్ ఉద్దీన్,రాజిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి వ× సింగిల్ విండో డైరెక్టర్ మైపాల్ రెడ్డి ,పెంట రాజు,శ్రీనివాస్ రెడ్డి ఖలీల్, సిద్ధం రాజమల్లు,జంగపల్లి రాజమల్లు,అక్కపాక శంకర్,వార్డ్నెంబర్ రమేష్,కాసార్ల వేల్పుల,సునీల్.సురేష్. వేల్పుల శంకర్,జాడి శంకర్,లింగయ్య,.పాల్గొన్నారు.

# బాణసంచా దుకాణాల్లో అగ్నిమాపక భద్రతపై రూరల్ ఎస్ఐ అవగాహన

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) అక్టోబర్ 5**

చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాణసంచా (క్రాకర్) దుకాణాలను రూరల్ ఎస్ఐ జి. అనిల్ కుమార్ సందర్శించారు.ఈ సందర్భంగా షాపు యజమానులు, సిబ్బందికి అగ్నిమాపక భద్రతా నిబంధనలపై విస్తృత అవగాహన కల్పించారు. దుకాణాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.




# బీసీ కమిషన్ విజిట్ 7న నిజామాబాద్‌కు బీసీ కమిషన్.. వీడీసీల బహిష్కరణలపై సమావేశం

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి :**

బీసీ కమిషన్ ఈ నెల 7న బుధవారం నిజామాబాద్‌కు రానుంది. వీడీసీల గ్రామ బహిష్కరణలపై అధికారులతో కమిషన్ సమావేశం నిర్వహించనుంది.ఏర్గట్ల మండలంలోని తాళ్లరాంపూర్‌లో గౌడ, ఎస్సీ కులాలకు చెందిన పలువురిని ఇటీవల వీడీసీ సామాజిక బహిష్కరించినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఈ మేరకు బాధితులు అధికారులకు ఫిర్యాదు చేశారు. అంతేగాకుండా బీసీ, గౌడ సంఘాల నాయకులు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో బీసీ కమిషన్ స్పందించింది. తాళ్లరాంపూర్‌తో పాటు జిల్లాలోని 23 గ్రామాల్లో బహిష్కరణకు గురైన బాధితులతో మాట్లాడాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ కమిషన్ ప్రత్యేక కార్యదర్శి బాలమాయాదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

**బీసీ కమిషన్ విజిట్ అధికారులతో భేటీ**

జిల్లాలో గ్రామ అభివృద్ధి అభివృద్ధి కమిటీల సామాజిక బహిష్కరణ ఘటనలు, సామాజిక బహిష్కరణ బాధితులు, దాని నివారణ చర్యలపై జిల్లా యంత్రాంగం, పోలీసులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తామని బీసీ కమిషన్ తెలిపింది. తాళ్లరాంపూర్‌లో గౌడ కులస్తుల బహిష్కరణపై కమిషన్ ఈ నెల 3న సమావేశంలో చర్చించింది. జిల్లాలో ఇటువంటి సంఘటనలు తరచుగా జరగడాన్ని తీవ్రంగా పరిగణించిందని ఆమె పేర్కొన్నారు.

**బీసీ కమిషన్ విజిట్ బాధితులు హాజరు కావాలి**

కమిషన్ ఈ నెల 7న నిజామాబాద్ నిజామాబాద్ ను సందర్శించి, జిల్లాలోని గ్రామ అభివృద్ధి కమిటీలు విధించిన సామాజిక బహిష్కరణల బాధితులతో మాట్లాడాలని నిర్ణయించింది. ఆయా గ్రామాలకు చెందిన గ్రామ అభివృద్ధి కమిటీల బాధితులు తమ సమస్యలను తెలియజేయడానికి కమిషన్ ముందు హాజరయ్యేలా చూడాలని పోలీసులను కమిషన్ ఆదేశించింది. ఆ గ్రామాలు నాగపూర్, వేల్పూర్, మారంపల్లి, నందిపేట్, గుమ్మిర్యాల్, ఏర్గట్ల, పిప్రి, దోమచంద, సావెల్, నాగంపేట, మంథని, తాళ్ల రాంపూర్, జక్రాన్‌పల్లి, చేంగల్, చౌట్‌పల్లి, మోతే, బస్సాపూర్, పచ్చల్ నడ్కుడ, మిర్దాపల్లి, దేగాం (ఆర్మూర్), అమ్దాపూర్, మిట్టపల్లి, దేగం (ఆలూరు), అంకాపూర్. ఈ గ్రామాల్లోని వీడీసీల బాధితులతో పాటు కలెక్టర్, పోలీస్ కమిషనర్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు, ఆయా మండలాల్లోని ఎస్‌హెచ్‌వోలు, బీసీ సంక్షేమ అధికారితో బీసీ కమిషన్ సమావేశం నిర్వహించనుంది.కమిషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాల లక్ష్మి రంగూ జిల్లాలో పర్యటిస్తారు. బుధవారం ఉదయం 11 గంటలకు కమిషన్ నగరానికి చేరుకుంటుంది. మధ్యాహ్నం 1:30 గంటల వరకు కలెక్టరేట్‌లో సామాజిక బహిష్కరణకు గురైన బాధితులతో మాట్లాడుతుంది. అనంతరం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై మధ్యాహ్నం 02:30 నుండి సాయంత్రం 04:30 వరకు అధికారులతో సమావేశం ని



మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 06, 2026




బస్సు కోసం వేచి ఉన్న బాలికను

ఇంటి వద్ద దింపుతానంటూ బైక్‌పై ఎక్కించుకున్న వృద్ధుడు.. దారిలో లైంగిక దాడికి యత్నం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్‌లో ఘటన.. నిందితుడిపై పోక్సో కేసు, దాడికి పాల్పడిన 14 మంది బంధువులపైనా కేసు

**మన దునియా,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,అశ్వాపురం,బుడుగు బజార్:అక్టోబర్ 05**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం బుడుగు బజార్‌లో 16 ఏళ్ల బాలికపై 60 ఏళ్ల వృద్ధుడు అత్యాచార యత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. తన ఇంటి సమీపంలో నివసించే బాలికపై కన్నేసిన రాయల కోటయ్య (60) ఆమెను ఒంటరిగా ఉన్న సమయంలో అడ్డగించి లైంగిక దాడికి ప్రయత్నించినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.భద్రాచలంలో ఇంటర్ చదువుతున్న బాలిక రామచంద్రాపురం బస్‌స్టాప్ వద్ద బస్సు కోసం వేచి ఉండగా.. అదే మార్గంలో బైక్‌పై వెళ్తున్న కోటయ్య ఆమెను గమనించాడు. ఇంటి వద్ద దింపుతానని చెప్పి బాలికను బైక్‌పై ఎక్కించుకున్నాడు. కొంతదూరం వెళ్లిన తర్వాత బైక్‌ను ఆపి బాలికపై లైంగిక దాడికి ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.అయితే బాలిక అతని నుంచి తప్పించుకుని అక్కడి నుంచి బయటపడింది. ఈ విషయాన్ని ఇంట్లో ఎవరికైనా చెబితే చంపేస్తానంటూ కోటయ్య బాలికను బెదిరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ బాలిక భయపడకుండా జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. విషయం తెలుసుకున్న బాలిక బంధువులు తీవ్ర ఆగ్రహానికి గురై కోటయ్య ఇంటికి వెళ్లి అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కోటయ్యపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.మరోవైపు నిందితుడిపై దాడి చేసిన ఘటనను కూడా పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. కోటయ్యపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న బాలిక బంధువుల్లో 14 మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. లైంగిక నేరాలకు సంబంధించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం కాకుండా పోలీసులను ఆశ్రయించాలని అధికారులు సూచిస్తున్నారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు సంబంధించి పోక్సో చట్టం కఠినమైన నిబంధనలను కలిగి ఉంది. బాలిక వాంగ్మూలం, కుటుంబ సభ్యుల ఫిర్యాదు, ఘటనకు సంబంధించిన ఇతర ఆధారాలను పోలీసులు సేకరించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# తాళ్లరాంపూర్ వీడీసీపై చర్యలు తీసుకోవాలి

తాళ్లరాంపూర్ వీడీసీపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, ధర్మసమాజ్ పార్టీ నాయకులు, గౌడ కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు.

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

తాళ్లరాంపూర్ వీడీసీపై వెంటనే చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ ఎస్ టి , జేఏసీ ధర్మసమాజ్ పార్టీ నాయకులు, గౌడ కుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలో రహదారిపై ధర్నా నిర్వహించారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కండెల సుమన్ మాట్లాడుతూ.. ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీ వారు 39 గీత కార్మిక, 11 దళిత కుటుంబాలను సాంఘిక బహిష్కరణ చేశారన్నారు. ఈ విషయమై గతనెల 28న కలెక్టర్ నిజామాబాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారం రోజుల్లో ఈ సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారని ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆదేశాల మేరకు జేఏసీ, గౌడ, డీఎస్పీ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.

**తల్లారాంపూర్ వీడీసీ యాక్షన్ వీడీసీలను రద్దు చేయాలి**

రాజ్యాంగ విరుద్ధమైన వీడీసీలను వెంటనే రద్దు చేయాలని జేఏసీ డిమాండ్ చేస్తోందన్నారు. వీడీసీ ముసుగులో కొందరు బీసీ,ఎస్సీ ఎస్టీలపై పెత్తనం చెలాయిస్తూ బహిష్కరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సంఘటనపై ప్రజాస్వామ్యం బద్ధంగా ఎన్నికైన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, స్థానిక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి బాధితుల పక్షాన లేకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే వారు స్పందించి బాధితుల పక్షాన పోరాటం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు రామా గౌడ్, ప్రేమ్, మహిపాల్, మెద గంగారాం, సుదర్శన్, మురళి, ఉమేష్, మహేష్, భుమేష్, మహిపాల్, మహేష్, నర్సా గౌడ్ పాల్గొన్నారు




# లాభాల ప్రకటన ఇతర సమస్యలపై సీఐటీయూ ప్ల కార్డులతో నిరసన

**మన దునియా, అక్టోబర్ 05,మంచిర్యాల జిల్లా**

సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కేకే -5, కాసిపేట మైన్, కాసిపేట్ -2, మందమర్రి సివిల్ డిపార్ట్మెంట్, 132 కేవీ సబ్ స్టేషన్, పిట్ కమిటీల ఆధ్వర్యంలో వివిధ సమస్యలపై ప్లకార్డులతో నిరసన తెలుపడం జరిగింది. ఇందులో ముఖ్యంగా యాజమాన్యం గత ఆర్థిక సంవత్సరం వచ్చిన లాభాలను తెలియజేయాలని, గత ఆర్థిక సంవత్సరం సిఎంపీఫ్ నిల్వను పోర్టల్ లో అప్డేట్ చేయాలని, రక్షణ పరికరాలను సమయానికి ఇవ్వాలని, ఆఫీసులలో కొత్త కంప్యూటర్-ప్రింటర్-స్కానర్లను ఏర్పాటు చేయాలని, మెడికల్ బోర్డులో వివిధ జబ్బులతో ఉన్నవారికి మెడికల్ ఫిట్ సర్ఫేస్ ఇచ్చిన వారిని మళ్లీ రీ మెడికల్ కు పిలవాలని, 150 మస్టర్లు చేయకుంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామన్న సర్క్యులర్ రద్దు చేయాలని, డిప్యూటేషన్ వెళ్లిన వారికి పి ఎల్ ఆర్ బోనస్ లాభాల వాటలో కొత్త విధించే సర్క్యులర్ రద్దు చేయాలని, యువ కార్మికులతో జూనియర్ అసిస్టెంట్ సెక్యూరిటీ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్ల కార్డులతో నినాదాలు నిరసన తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బద్రి.ఆదర్శ్,భేతి.భరత్,బుద్దే సురేష్, నాగవెల్లి.శ్రీధర్, కాలువల.శ్రీనివాస్, రాంబాబు,, బాసబోయిన.కుమారస్వామి, ఆగిడి.రాజ్ కుమార్, గుళ్ళ.బాలాజీ, ధనిశెట్టి సురేష్, విద్యాసాగర్,రమేష్,ధరన్, రాజ్ కుమార్, యశ్వంత్, హనుమంతు, అనిల్, సుకుమార్, శ్రీనివాస్, అరుణ్, గంగయ్య,సూరజ్,రమేష్,జుట్టు.అజయ్, లవన్ కుమార్, రాజేంద్ర ప్రసాద్, రాజశేఖర్, సాయినాథ్, శ్రీనివాస్,రవీందర్, శేఖర్ లు పాల్గొన్నారు.






# పేరూరు పోలీస్ స్టేషన్లో ఎస్సై జి కృష్ణ ప్రసాద్ కు వీడ్కోలు

**మన దునియా, వాజేడు ,అక్టోబర్ 5**

పోలీస్ స్టేషన్ పరిధిలో గత రెండున్నర సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఎస్సైజి కృష్ణ ప్రసాద్ బదిలీపై వెళ్తున్నారు బాధ్యతలు స్వీకరించనున్నారు ఎస్సై జి కృష్ణ ప్రసాద్ తన రెండున్నర సంవత్సరాల పదవి కాలంలో శాంతిభద్రతల పరిరక్షణ ప్రజల భద్రత నేరాల నియంత్రణతో పాటు పోలీస్ స్టేషన్ లో వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించారు ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీస్ శాఖ పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించారు అలాగే పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నేరనీయంత్రణ గిరిజన మరియు మారుమూల ప్రాంతాల్లో ప్రజలకు పోలీసు సేవలు అందించడం వంటి అంశాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారు ఆయన సేవలను పోలీసు అధికారులు సిబ్బంది మరియు స్థానిక ప్రజలు అభినందించారు బదిలీపై వెళ్తున్న ఎస్సై జి కృష్ణ ప్రసాద్ కు పోలీసు అధికారులు సిబ్బంది ప్రజలు మీడియా మిత్రులు భారీగా శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన భవిష్యత్తు వీధులో మరింత ఉన్నత స్థాయి ఎదగాలని ఆకాంక్షించారు నూతనంగా పేరూరు పోలీస్ స్టేషన్ ఎస్ ఐ గా బాధ్యతలు స్వీకరించనున్న ఆర్ అశోక్ పోలీస్ సిబ్బంది స్వాగతం పలుకుతూ ఆయన ఆధ్వర్యంలో కూడా పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ నేర నియంత్రణ మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుకుంటున్నాను




# జిల్లావ్యాప్తంగా సోమవారం బార్లు మూసి ఉంచారు

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు విచ్చలవిడి పర్మిట్‌రూంల ఏర్పాటును నిరసిస్తూ వారు ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్ లోని నాంపల్లి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట

బార్ ఓనర్స్ ప్రొటెస్ట్ ప్రివిలేజ్ ట్యాక్స్ పేరుతో వడ్డన

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి**

..రాష్ట్రవ్యాప్తంగా బార్లపై ప్రభుత్వం కొత్త నిబంధన ప్రవేశపెట్టింది. ప్రతి బార్10శాతం ప్రివిలేజ్ ట్యాక్స్ కట్టాలని సూచించింది. ఈ నిర్ణయాన్ని రాష్ట్ర బార్ల అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తోంది. ములిగే నక్క మీద తాటికాయ పడ్డట్లుగా ఇప్పటికే బార్లను నడిపించడంలో ఇబ్బందులు పడుతున్న తమకు ట్యాక్స్ రూపంలో ప్రభుత్వం వసూళ్లకు పాల్పడడం ఎంతమాత్రం సరైంది కాదని వారు పేర్కొంటున్నారు.బార్ ఓనర్స్ ప్రొటెస్ట్ విచ్చలవిడిగా పర్మిట్ రూంలతో..అలాగే రాష్ట్రవ్యాప్తంగా వైన్స్‌ల వద్ద విచ్చలవిడిగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడంతో బార్లకు గిరాకీ లేకుండా పోయిందని నిర్వాహకులు వాపోతున్నారు. ఒక పర్మిట్ రూం కేవలం 100 గజాల్లో ఉండాల్సి ఉండగా.. అడ్డదిడ్డంగా విశాల ప్రాంతంలో వాటిని ఏర్పాటు చేసి బార్ల పొట్టగొడుతున్నారని వారు వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూంలు ఏర్పాటు చేసినప్పటికీ ఎక్సైజ్ శాఖ స్పందించడం లేదని వారు వాపోయారు. ప్రభుత్వం వెంటనే ప్రివిలేజ్ ట్యాక్స్ తీసివేయాలని.. పర్మిట్‌రూం నిబంధనలు పక్కాగా అమలు చేయాలని కోరుతున్నారు. హైదరాబాద్‌లోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమ నిజామాబాద్ జిల్లా బార్ల అసోసియేషన్ అధ్యక్షుడు దేవన్న, కార్యదర్శి సంతోష్, విన్ను, జనార్ధర్, విశ్వనాథ్, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# న్యాయం కావాలని ఎంపిడీఓ ఆఫీస్ దిగ్బంధించిన పురాణి పేట్ గ్రామస్థులు

- ఎంపీడీవో ఆఫీస్ ముట్టడి ఉద్రిక్త చోటుచేసుకుంది.
- భారీగా పోలీసులు మోహరింపు

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

ప్రజావాణిని అడ్డుకొన్న పురానిపేట్ గ్రామస్థులుభూకబ్జాలకు అధికారుల వత్తాసుపై ఆగ్రహంభీమ్ గల్,తమ గ్రామానికి చెందిన పశువులను నిలుపుకోనే స్థలాన్ని భీమ్ గల్ కు చెందిన కొందరు కబ్జా చేస్తున్నారని ఎన్ని సార్లు విన్నవించిన అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహించిన పురాణిపెట్ గ్రామస్థులు ఎంపీడీఓ ఆఫీస్ ను దిగ్బందం చేశారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం ఉండగా గ్రామ ప్రజలు, మహిళాలు పెద్ద ఎత్తున ఎంపీడీఓ ఆఫీస్ కు తరలివచ్చి ఆఫీస్ ప్రధాన ద్వారం వద్ద బైఠయించి ధర్నా నిర్వహించారు. తమ గ్రామానికి చెందిన బర్లు, ఆవులను నిలిపి, స్వేధ తీర్చే అసైండ్ భూమిని భీమ్ గల్ కు చెందిన కొందరు కబ్జా చేస్తున్నారన్నారు. ఈ విషయమై కలెక్టర్ ఆఫీస్ కు వెళ్లి ప్రజవాణిలో ఫిర్యాదు చేసామని, స్థానిక ఎంపిడీఓ ఆఫీస్ లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు చేసినప్పటికి తహసీల్దార్, రెవిన్యూ సిబ్బందితో పాటు స్థానిక పోలీసులు కబ్జాదారులకే మద్దత్తునిస్తున్నారంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు ఈ విషయంలో విచారణ జరిపి గ్రామస్థులకు తగు న్యాయం చెయ్యాలని, కబ్జాదారులకు వత్తాసు పలుకుతున్న అధికారులపై కఠిన చర్యలు చేపట్టాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.





# అథ్లెటిక్స్ లోఅద్భుత ప్రతిభను పలు విభాగాల్లో కనబరిచిన పెద్ద గొల్లగూడెం విద్యార్థినిలు

**మన దునియా ,వాజేడు ,అక్టోబర్ 5**



అథ్లెటిక్స్ అసోసియన్ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన బండారుపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి జూనియర్ అట్లాంటిక్ పోటీలు ఎ జీ హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం పాఠశాల విద్యార్థినిలు అద్భుత ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో బహుమతులు సాధించారు అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నవంబర్ నెలలో సంగారెడ్డి లో నిర్వహించను జాతీయస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీలకు పాఠశాల విద్యార్థినులు అర్హత సాధించటం విశేషం తుర్స అక్షర-8 వ తరగతి విద్యార్థిని ట్రాయా థ్లన్ విభాగంలో ప్రథమ బహుమతి లాంగ్ జంప్ లో ప్రథమ బహుమతి 400 మీటర్ల పరుగులు ప్రథమ బహుమతి బడే హర్షిని 9వ తరగతి విద్యార్థిని ట్రయాథ్లాన్ విభాగంలో ప్రథమ బహుమతి లాంగ్ జంప్ లో ద్వితీయ బహుమతి బడే హర్షిత 9వ తరగతి విద్యార్థిని ట్రయాథ్లాన్ విభాగంలో ద్వితీయ బహుమతి లాంగ్ జంప్ లో తృతీయ బహుమతి కిడ్స్ జావేలిన్ త్రో విభాగంలో ద్వితీయ బహుమతి ఈ విజయాలతో విద్యార్థులు నవంబర్లో సంగారెడ్డిలో జరిగే అథ్లెటిక్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ మీట్ కు పర్వత సాధించారు విద్యార్థినిలు విజయంపై ఏ జి హెచ్ ఎస్ పెద్ద గొల్లగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇర్పప కేశవరావు ఉపాధ్యాయులు పూణేం రోజా రాణి పాయం తిరుపతమ్మ పెండకట్ల బుచ్చిబాబు తోలేం కృష్ణయ్య అట్టం రామారావు కోడి భారతి యాలం ఉమాదేవి అరేం సౌజన్య మైపతిరావు సృజన గొంది కవిత యలం ధనలక్ష్మి ఇర్పప గౌతమి అలాగే ఫిజికల్ డైరెక్టర్ గుండ్ల రాజు విద్యార్థినులను అభినందించారు

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 06, 2026

# పేటలో ఘనంగా ఏపీయూడబ్ల్యూజే (APUWJ) సాధారణ సమావేశం

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) అక్టోబర్ 5**

చిలకలూరిపేట పట్టణంలోని అమరావతి రెసిడెన్సీలో ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ సాధారణ సమావేశం ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. పల్నాడు జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్,చిలకలూరిపేట అధ్యక్షులు అడపా అశోక్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాకు చెందిన సీనియర్ పాత్రికేయులు హాజరై తమ అమూల్యమైన సూచనలు,సలహాలు అందించారు. పాత్రికేయ వృత్తికి వన్నెతెచ్చేలా నడవడిక:అడపా అశోక్ కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అడపా అశోక్ కుమార్ పాత్రికేయుల జీవనశైలి, యూనియన్ విధివిధానాలపై సూచనలుఅందించారు. ముఖ్యంగా నూతనంగా జర్నలిజం రంగంలోకి అడుగుపెడుతున్న యువ విలేకరులకు ఆయన దిశానిర్దేశం చేశారు.సమాజంలో విలేకరి అంటే కేవలం వార్తలు రాసే వ్యక్తి కాదని, ప్రజల పక్షాన నిలబడేబాధ్యతాయుతమైన గొంతుక అని ఆయన గుర్తుచేశారు. నిష్పక్షికంగా వ్యవహరిస్తూ,వృత్తిగత విలువలు కాపాడుకుంటూ నిజాయితీగా ఎలా నడుచుకోవాలో



వివరించారు.యూనియన్ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన తెలిపారు.కష్టకాలంలో ఐకమత్యమే శ్రీరామరక్ష రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా కార్యదర్శి షేక్ మస్తాన్ మాట్లాడుతూ విలేకరుల

# అక్రమంగా తరలిస్తున్న 4,500 కిలోల పీడీఎస్ (రేషన్) బియ్యం పట్టివేత..!

**మన దునియా ( ఉమ్మడి గుంటూరు జిల్లా) అక్టోబర్ 5 గుంటూరు**

వడ్డేశ్వరం వద్ద విజిలెన్స్, సివిల్ సప్లయ్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు. విజయవాడ నుంచి గుంటూరు తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యం తో పాటు TATA INTRA వాహనం స్వాధీనం.డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించిన అధికారులు.అక్రమ రవాణాకు సంబంధించి పలువురిపై కేసు నమోదు.పేదలకు అందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని విజిలెన్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ హెచ్చరిక.



# పేట, నరసరావుపేట మున్సిపాలిటీలను ఎస్సీలకు రిజర్వ్ చేయాలి

## - ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ డిమాండ్

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) అక్టోబర్ 5**

పల్నాడు జిల్లా లోని చిలకలూరిపేట, నరసరావుపేట మున్సిపాలిటీలను ఎస్సీలకు రిజర్వ్ చేయాలని ఎమ్మార్పీఎస్ (వీ=వా) రాష్ట్ర అధికార ప్రతినిధి కోట సుబ్బు మాదిగ డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మాన్యశ్రీ ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షులు పానుగంటి షాలేం రాజు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన పీజీఆర్ఎస్ (గ్రా+=వా) కార్యక్రమంలో ఆయన కలెక్టర్‌ను కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ మున్సిపాలిటీల ఎస్సీ రిజర్వేషన్ల అంశాన్ని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ప్రధానంగా కోరారు.ఈ సందర్భంగా కోట సుబ్బు మాదిగ మాట్లాడుతూ మున్సిపాలిటీల అభివృద్ధిలో ఎస్సీలు భాగస్వాములుగా ఉన్నారని, ఇంటి పన్ను, ఆస్తి పన్ను నుంచి నీటి పన్ను వరకు క్రమం తప్పకుండా చెల్లిస్తున్నారని గుర్తుచేశారు. అయితే, పాలక, ప్రతిపక్ష పార్టీలు తమను కేవలం పన్నులు కట్టే పౌరులుగానే మిగిల్చాయని, ఇప్పటికీ దళితులను అంటరానివారిగానే చూస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట మున్సిపాలిటీలో ఇప్పటికే ఓసీ, బీసీ, మైనార్టీ, ఎస్టీ సామాజిక వర్గాలకు అవకాశం దక్కిందని, ఇక మిగిలిన ఎస్సీలకు కచ్చితంగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా, నరసరావుపేట మున్సిపాలిటీలో ప్రధానంగా నాలుగు సామాజిక వర్గాలు మెజారిటీగా ఉన్నప్పటికీ, ఎస్సీలకు ఒక్కసారి కూడా అవకాశం ఇవ్వకపోవడం వెనుక ఉన్న ఆంతర్యాన్ని రాజకీయ పార్టీలు బయటపెట్టాలని ఆయన ప్రశ్నించారు. ఈ రెండు నియోజకవర్గాల్లో మున్సిపల్ రిజర్వేషన్ల విషయంలో ఎస్సీలకు న్యాయం చేయకపోతే.. దళిత వాడల నుంచి తీవ్ర స్థాయిలో నిరసన సెగలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ పల్నాడు జిల్లా అధ్యక్షులు గుండాల నగేష్, నరసరావుపేట నియోజకవర్గ అధ్యక్షులు దేవదానం మాదిగ, నరసరావుపేట మండల అధ్యక్షులు వేశపోగు తిమోతి మాదిగ, రొంపిచర్ల మండల అధ్యక్షులు రేలంగి శ్యాంబాబు మాదిగ, ఈపూరు మండల అధ్యక్షులు మరియాదాసు మాదిగ, వినుకొండ ఇంచార్జ్, సీనియర్ నాయకులు పచ్చిగోళ్ళ సుధాకర్ మాదిగ, పట్టణ అధ్యక్షులు వేల్పుల రాంబాబు మాదిగ, మహిళా నాయకురాలు రేపూడి శాంత కుమారి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలన ఏపీకి స్వర్ణయుగం

## జగన్ పాలన చీకటి యుగం : ప్రత్తిపాటి

- అడుగడుగునా అభివృద్ధి.. అన్నివర్గాలు మెచ్చే సంక్షేమం.
- ప్రజాప్రభుత్వమంటే ఇలా ఉండాలని కూటమి ప్రభుత్వం చేతలతో నిరూపిస్తోంది
- చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ ల పట్టువదలని సంకల్పానికి మోదీ సహకారం తోడవడం.. రాష్ట్రానికి దేవుడిచ్చిన వరం. : ప్రత్తిపాటి

**మన దునియా (ఉమ్మడి గుంటూరు జిల్లా) అక్టోబర్ 5**



“ కేవలం వాగ్దానాలకే పరిమితం కాకుండా.. ఆచరణాత్మక ధృక్పథం, ప్రజల ఆశలు, ఆకాంక్షల దిశగా కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులేస్తోంది. సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగే సమర్థుడైన నాయకుడి పాలనలో ప్రజలకు ప్రతిరోజూ పండగేననే అభిప్రాయం రోజురోజుకీ బలపడుతోంది. ప్రజల మనసెరిగి పాలన చేసే నిజమైన ప్రజా ప్రభుత్వం ఇలా ఉండాలి.. ఉంటుందని కూటమి ప్రభుత్వం చేతలతో నిరూపిస్తోంది. కూటమి పాలన ఏపీకి స్వర్ణయుగమైతే..... జగన్ పాలన ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని చీకటి యుగం. అభివృద్ధి, పెట్టుబడులు, మౌలిక వసతుల కల్పనకు కూటమి అధిక ప్రాధాన్యమిస్తుంటే.. అవినీతి, దుష్ప్రచారం, కుంభకోణాల మాటున వైసీపీ నీచ రాజకీయాలు చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ ల అపూర్వ కల

# అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పలకల పంపిణీ

**ఖానాపూర్ ఆర్సి మన దునియా;అక్టోబర్ 05:**

జన్నారం: సేవా సంకల్ప అభియాన్ అంగన్ మిలన్ జిల్లా ఇన్‌చార్జ్ నల్లుల సంగీత, అడ్వకేట్, ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బొప్పరపు సత్యవతి జన్నారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు వారికి మర్యాదపూర్వకంగా శాలువాతో సన్మానించారు.అనంతరం పొనకల్, రోటిగూడ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లను సన్మానించారు. కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించి, పిల్లలకు పలకలను అందజేశారు. చిన్నారుల విద్య, ఆరోగ్యం, పోషణపై అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నాయకులు సూచించారు. కార్యక్రమంలో నిర్మల్ జిల్లా కౌన్సిల్ మెంబర్ కొంతం శంకరయ్య, ఎస్టీ మోర్చా రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ అజ్మీర బద్రి నాయక్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బెడద గోపాల్, పొనకల్ ఉపసర్పంచ్ అప్పల జలపతి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కందుల రమేష్, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి సేపురి మానస, మండల అధ్యక్షురాలు శిరీష, నాయకురాలు మమత, రోటిగూడ సర్పంచ్ జిల్లపల్లి గోపాల్, శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ సేపురి గోపాల్, నిరటి శ్రీనివాస్, వార్డు



మెంబర్, బూత్ అధ్యక్షులు ఉప్పు రాజన్న, మెద అశోక్, బీజేపీ కార్యకర్తలు పల్లె లచ్చన్న, పదం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# నాపై ఐటీ దాడులా.. అసలు నిజాలు తెలుసుకోరా? రకుల్ ప్రీత్ సింగ్

**మన దునియా,హైదరాబాద్:అక్టోబర్ 05**



వార్త ఏదైనా సరే.. నిజానిజాలు నిర్ధారించుకోకుండా కేవలం వ్యూస్, రేటింగ్స్, సంచలనాల కోసమే కథనాలు అల్లేసే ధోరణి మీడియా తయారైంది అంటూ రకుల్ ప్రీత్ సింగ్ ఫైర్ అయ్యారు. ముంబైలోని సుమారు 12 చోట్ల రకుల్ ప్రీత్ సింగ్‌కు చెందిన నివాసాలు, ఆఫీసులపై ఆదాయపు పన్ను శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారంటూ గత రెండు రోజులుగా మెయిన్‌స్ట్రీమ్ మీడియాతో పాటు సోషల్ మీడియాలో కథనాలు తెగ చక్కర్లు కొట్టాయి. ఈ ప్రచారంపై తీవ్ర మనస్తాపానికి గురైన రకుల్.. తాజాగా 'ఎక్స్' వేదికగా నేరుగా రంగంలోకి దిగి ఆ వార్తలన్నింటినీ ఖండిస్తూ గట్టి కౌంటర్ ఇచ్చారు. సోషల్ మీడియా వేదికగా రకుల్ స్పందిస్తూ మీడియా తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “వాస్తవాలు కనీసం చెక్ చేసుకోకుండా సంచలనం కోసం తాపత్రయపడే కొందరు ఆన్‌లైన్ రిపోర్టర్లు, మెయిన్ స్ట్రీమ్ మీడియా జర్నలిస్టుల తీరు చూస్తుంటే నిజంగా బాధేస్తోంది. అందుకే అసలు వాస్తవాలను అందరికీ ఒకేసారి తేల్చి చెప్పాలనుకుంటున్నా. తాజాగా జరిగిన ఆ ఐటీ సోదాలకు, నాకు ఎలాంటి సంబంధం లేదు. అది నాపై జరిగిన దాడి కానే కాదు. నేను ఒక ఆర్మీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చాను. సినీ పరిశ్రమలో నాకు ఎలాంటి గాడ్‌ఫాదర్స్ లేరు. నా స్వయంకృషితో, కష్టపడి పైకొచ్చాను. చట్టాన్ని గౌరవించే బాధ్యతాయుతమైన భారత పౌరురాలిగా 20 ఏళ్ల వయసు నుంచే నా ప్రతి పైసాకు సక్రమంగా పన్నులు చెల్లిస్తున్నాను. వ్యక్తిగతంగా గానీ, ఏ ప్రొడక్షన్ హౌస్ తరపున గానీ ఎలాంటి అక్రమ విదేశీ లావాదేవీల్లోనూ నేను భాగస్వామిని కాను.

**బినామీ ఆస్తులు లేవు.. ఎవరి గిఫ్టులూ తీసుకోను!**

దేశంలో కానీ, విదేశాల్లో కానీ ఎవరి తరపునా నాకు ఒక్క బినామీ ఆస్తి కూడా లేదు. నా కెరీర్‌లో ఇప్పటివరకు ఎవరూ నాకు ఆస్తులను గిఫ్ట్‌గా ఇవ్వలేదు.. నాకంటూ ఒక సూత్రం ఉంది, జీవితంలో ఎవరి నుంచీ అలాంటి ఖరీదైన బహుమతులను నేను తీసుకోను. మీడియా బిజినెస్ నడపడంలో ఎవరికి ఉండే వ్యాపార ఒత్తిళ్లు వారికి ఉంటాయని నాకు తెలుసు. అంతమాత్రాన ఆ ఒత్తిళ్లు నిజాలను తొక్కిపెట్టేలా ఉండకూడదు. ఇంకొకరి పరువు, గౌరవ మర్యాదలు, జీవితాలను బలిపీఠం ఎక్కించి వ్యాపారం చేసుకోకూడదు. నాపై ఇలాంటి నిరాధారమైన, ద్వేషపూరితమైన వార్తలు రాసిన ప్రతి ఒక్కరూ తక్షణమే ఆ తప్పుడు కథనాలను వెనక్కి తీసుకుని, వాస్తవాలను ప్రజలకు స్పష్టం చేయాలని కోరుతున్నాను”అంటూ రకుల్ విజ్ఞప్తి చేశారు..

# ఏపి హై కోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా ఐదుగురు జడ్జిలు బాధ్యతల స్వీకరణ

**మన దునియా,అమరావతి,అక్టోబర్ 05**




ఆంధ్రప్రదేశ్ హై కోర్టుకు శాశ్వత న్యాయమూర్తులుగా అదనపు న్యాయమూర్తులు జస్టిస్ కుంచం మహేశ్వరరావు, జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్), జస్టిస్ చల్లా గుణరంజన్,జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ,జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులు బాధ్యతలు స్వీకరించారు.ఏపి హై కోర్టు మొదటి కోర్టు హాల్లో ఫుల్ బెంచ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ కుంచం మహేశ్వరరావు,జస్టిస్ తూట చంద్ర ధనశేఖర్ (టీసీడీ శేఖర్),జస్టిస్ చల్లా గుణ రంజన్,జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ,జస్టిస్ డాక్టర్ యడవల్లి లక్ష్మణ రావులచే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లీసా గిల్ ప్రమాణ స్వీకారం చేయించారు.రాష్ట్ర హై కోర్టులో ఐదుగురు శాశ్వత న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదముద్ర వేయడంతో కేంద్ర న్యాయశాఖ అధికారికంగా నోటిఫికేషన్ జారీ చేయగా ఈ5గురు శాశ్వత న్యాయమూర్తుల ప్రమాణస్వీకారం జరిగింది. ఏపీ హైకోర్టులో సేవలందిస్తున్న ఇతర గౌరవనీయ న్యాయ మూర్తులందరూ ఈ వేడుకకు హాజరై తమ సహచర న్యాయమూర్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు,బార్ కౌన్సిల్ ప్రతినిధులు,హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ సభ్యులు,సీనియర్ న్యాయ వాదులు,న్యాయాధికారులు,రిజిస్ట్రార్లు,న్యాయశాఖ అధికారులు,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
RNI Number TELTEL/2023/85680
మన అక్షరం - మన ప్రపంచం
మంగళవారం, అక్టోబర్ 06, 2026

# తిప్పని మహేందర్ వికలాంగుడు భూమి కబ్జా ఆరోపణలు

## ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే లేడా?

**మన దునియా,మల్లంపల్లి:అక్టోబర్ 05**

మల్లంపల్లి: మల్లంపల్లి మండలానికి చెందిన తిప్పని మహేందర్ భూమిని కబ్జా చేశారంటూ ఆరోపిస్తూ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. తన భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని మహేందర్ అధికారులను కోరుతున్నట్లు తెలుస్తోంది.ప్రజావాణిలో ఫిర్యాదు సమర్పించి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. తన సమస్యపై ఇప్పటివరకు తగిన చర్యలు కనిపించడం లేదని మహేందర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**ఫిర్యాదు చేసినా చర్యలు ఎక్కడ?**

తిప్పని మహేందర్ భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి బాధితుడికి న్యాయం చేస్తారా? లేదా అన్నది వేచి చూడాలి.




# డీఎంహెచ్‌వో కాట్ బై ఏసీబీ। రూ.లక్ష లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వో

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

డి ఎం హెచ్ ఓ ఏసీబీ। రూ.లక్ష లంచం తీసుకుంటూ.. ఏసీబీకి చిక్కిన డీఎంహెచ్‌వోరంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు.

**మన దునియా,రంగారెడ్డి జిల్లా: అక్టోబర్ 05**

రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి రూ.లక్ష లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. ఈ మేరకు కార్యాలయంలో అధికారులు సోమవారం దాడులు చేపట్టారు.రాజేంద్రనగర్‌లోని రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఓ ప్రైవేట్ డ్రైవర్ ద్వారా డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. జిల్లాలోని ఓ ప్రైవేట్ ఫిజియోథెరపీ సెంటర్‌ను ఇటీవల వైద్యారోగ్య శాఖ అధికారులు సీజ్ చేశారు. దానిని తిరిగి తెరవడానికి అనుమతి కోసం డీఎంహెచ్‌వో రూ.రెండు లక్షల లంచం డిమాండ్ చేశారు. డీఎంహెచ్‌కాట్ బై ఏసీబీ। డ్రైవర్ ద్వారా..హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ డ్రైవర్ మద్దురి కృష్ణయ్య ద్వారా డీఎంహెచ్‌వో లంచం అడిగారు. ఈ మేరకు కృష్ణయ్య సోమవారం ఫిర్యాదుదారుడి నుంచి రూ.లక్ష లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అనంతరం ఈ కేసులో డీఎంహెచ్‌వో స్వర్ణకుమారి, హెల్త్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌పై సైతం కేసు నమోదు చేశారు. డ్రైవర్ కృష్ణయ్య డీఎంహెచ్‌వో, హెల్త్ ఇన్‌స్పెక్టర్ తరఫున మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముగ్గురిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. నిందితులను రిమాండ్‌కు తరలిస్తామని ఏసీబీ అధికారులు తెలిపారు.




# అనుమతి లేకుండానే పరీక్షల నిర్వహణ...?

విద్యాశాఖ అధికారుల అనుమతి లేకుండానే పరీక్షల నిర్వహణ...?

శ్రీ చైతన్యలో 8, 9 తరగతుల వ్యవహారంపై కలకలం...!

ప్రశ్నపత్రాలు ఎవరివి..? అనుమతులు ఎక్కడివి...!

విద్యాశాఖకు సవాల్‌గా మారిన శ్రీ చైతన్య పాఠశాల వ్యవహారం...

పాఠశాల యాజమాన్యం తీరుపై ప్రశ్నల వర్షం...

జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారుల మౌనమేల ?




**ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రతినిధి:**

బాన్సువాడ, కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని శ్రీ చైతన్య పాఠశాల లో 8,9 తరగతుల నిర్వహణకు సంబంధించిన అనుమతుల వ్యవహారం ఇంకా స్పష్టతకు రాకముందే పరీక్షల నిర్వహణకు సంబంధించిన అంశం చర్చనీయాంశంగా మారింది. పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు ఎక్కడి నుంచి వచ్చాయి..? వాటిని ఎవరు అందించారు..? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థుల వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.ఇటీవల పాఠశాలలో 8, 9 తరగతుల నిర్వహణకు అవసరమైన అనుమతులపై విద్యాశాఖ అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిన విషయం తెలిసిందే. అనుమతుల విషయంలో అక్టోబర్ మూడో తేదీ గడువు విధించిన నేపథ్యంలోనే పరీక్షల నిర్వహణకు సంబంధించిన వ్యవహారం తెరపైకి రావడం మరిన్ని సందేహాలకు తావిస్తోంది. ఇప్పటివరకు విద్యాశాఖ నుండి ఎలాంటి అనుమతులు రాలేదని పరీక్షల నిర్వహణ ఏ విధంగా నిర్వహిస్తారని విద్యార్థి సంఘాలు తల్లిదండ్రులు మండిపడుతున్నారు.ఎంఈఓ కార్యాలయం నుండి ఎలాంటి ప్రశ్న పత్రాలు ఇవ్వకుండా పాఠశాలలో పరీక్షలు ఏ విధంగా కొనసాగుతున్నాయని ప్రశ్నలు వెలువేతున్నాయి.విద్యాశాఖ నిబంధనలు బేకాతరూ చేస్తూ ఇష్టారీతిన శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తుంది. ఇంత జరుగుతున్న విద్యాశాఖ అధికారులు మౌనం ఎందుకు ఉంటున్నారని మనం వెనుక మతల భూమిని విద్యార్థి సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అనుమతులు లేకుండా తరగతుల నిర్వహిస్తున్న శ్రీ చైతన్య పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.అనుమతుల వ్యవహారం, పరీక్షల నిర్వహణపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి పూర్తి వివరాలను బహిర్గతం చేస్తారా..? లేక ఈ వ్యవహారం ఇలాగే ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుందా..? అనేది వేచి చూడాలి.ఎంఈఓ కార్యాలయం నుంచి ప్రశ్నపత్రాలు ఇవ్వలేదా..? విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పరీక్షలకు సాధారణంగా సంబంధిత అధికారిక వ్యవస్థ నుంచి ప్రశ్నపత్రాలు అందాల్సి ఉంటుంది. అయితే శ్రీ చైతన్య పాఠశాలకు ఎంఈఓ కార్యాలయం నుంచి ప్రశ్నపత్రాలు అందలేదనే సమాచారం వస్తోంది. అలాంటప్పుడు పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షలకు ప్రశ్నపత్రాలు ఎవరు రూపొందించారు..? వాటికి ఎవరి అనుమతి ఉంది..? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. నిబంధనలు పాటించారా..?పాఠశాల నిర్వహణ, తరగతుల అనుమతులు, పరీక్షల విధానానికి సంబంధించి విద్యాశాఖ నిబంధనలు వర్తిస్తాయి. ఈ నిబంధనలకు అనుగుణంగానే అన్ని ప్రక్రియలు కొనసాగుతున్నాయా లేదా అన్నది విద్యాశాఖ అధికారులు పరిశీలించాల్సి ఉంది. అనుమతుల అంశం పూర్తిగా తేలకముందే పరీక్షల నిర్వహణ జరిగితే దాని వెనుక ఉన్న విధానంపై అధికారులు వివరణ ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.జిల్లా ఉన్నతాధికారుల మౌనం ఎందుకు..?స్థానిక స్థాయిలో ఈ వ్యవహారంపై ప్రశ్నలు తలెత్తుతున్నప్పటికీ జిల్లా స్థాయి ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన స్పందన లేకపోవడంపై కూడా చర్చ జరుగుతోంది. పాఠశాలలో ఏ తరగతులకు అనుమతులు ఉన్నాయి..? ఏ తరగతులకు అనుమతులు లేవు..? పరీక్షలకు ప్రశ్నపత్రాలు ఎవరు అందించారు..? అనే అంశాలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.అనుమతులు లేని తరగతులకు ప్రశ్నాపత్రాలు ఇవ్వలేదు నాగేశ్వరరావు, విద్యాశాఖ అధికారి, బాన్సువాడ శ్రీ చైతన్య పాఠశాలలో 8 9 తరగతులకు విద్యాశాఖ నుండి సంబంధించిన అనుమతులు పొందలేదు. ఆ తరగతులకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను కూడా ఎంఈఓ కార్యాలయం నుండి అందజేయలేదని మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మన దునియాతో పేర్కొన్నారు. విద్యాశాఖ నిబంధనలు బేకాతలు చేస్తూ పరీక్షల నిర్వహణపై, ప్రశ్నాపత్రాలు విద్యాశాఖ నుండి అనుమతి లేకుండా ఏ విధంగా పరీక్షలు నిర్వహిస్తారు అనే అంశంపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

# విద్యార్థి పై దాడి చేసిన ప్రిన్సిపాల్ ను సస్పెండ్ చేయాలి

## -ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కు పి డి ఎస్ యు ఫిర్యాదు

**నిజామాబాద్ జిల్లా మన దునియా ప్రతినిధి:**

మోర్తాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థి నవీన్ పై పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసాద్ ఏ కారణం లేకుండా విద్యార్థులపై అతి కిరాతకంగా హింసించి వాతలు వచ్చే విధంగా కొట్టడాని అతనిని సస్పెండ్ చేయాలని పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షుడు సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణిలో ఈ మేరకు జిల్లా కలెక్టర్ కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిడిఎస్యు నిజామాబాద్, కామారెడ్డి సంయుక్త జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పిడిఎస్యు జిల్లా అధ్యక్షుడు ఎం నరేందర్ మాట్లాడుతూ మోర్తాడ్ బిసి వెల్ఫేర్ హాస్టల్ లో విద్యార్థి నవీన్ ను వాతలు వచ్చే విధంగా.. శరీరం రంగు మారెలా చితిక బాది చెప్పారని మాటలు తిడుతూ కొట్టిన ప్రిన్సిపాల్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థులు క్రమశిక్షణ నేర్పడం అంటే చితకబాదడం కాదు కదా అని విద్యార్థులకు ప్రేమ పూర్వకంగా విద్య నేర్పాలి, వారికి శ్రద్ధ కలిగే విధంగా శిక్షణ కొనసాగాలి అన్నారు. పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ చేయాలి... కానీ ఆసుపత్రికి పాలయ్యే విధంగా కొట్టడం, హింసించడం సమంజసం కాదని వారు తెలిపారు. అలాగే విద్యార్థి చికిత్స కోసం అయ్యే ఖర్చు అంత ప్రభుత్వమే భరించాలి అని ఆయన తెలిపారు ఈ ఘటనపై విచారణ జరిపి భవిష్యత్తులో ఏ విద్యార్థుల పై ఇలాంటి చర్యలు ఉపాధ్యాయులు చేపట్టకుండా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యు జిల్లా కార్యదర్శి దుర్గాప్రసాద్,ఏరియా అధ్యక్షుడు డి. నిఖిల్, ప్రధాన కార్యదర్శి ఈ.రాజు, ఏరియా నాయకులు వినోద్, రాజేష్ , శివ, కుటుంబ సభ్యులు గణేష్, కళావతి, సురేష్, స్వప్న పాల్గొన్నారు





# ఆర్మూర్ లో ఆర్ఎంపీ పిఎంపి ల 'అడ్డగోలు' వైద్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం!

## - ప్రజల ప్రాణాలతో చెలగాటం గా మారిన ఆర్ఎంపి పిఎంపి ఫేక్ డాక్టర్లు

**మన దునియా,నిజామాబాద్ జిల్లా:అక్టోబర్ 05**

ఆర్మూర్ మండలం మరియు గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించాల్సిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధిని దాటి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఆర్మూర్ ప్రాంతాల్లో అత్యవసరపరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించాల్సిన కొందరు ఆర్ఎంపీ, పీఎంపీలు తమ పరిధిని దాటి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సరైన అర్హతలు, అనుమతులు లేకుండానే క్లినిక్లను ఏర్పాటు చేసి, ఆసుపత్రుల తరహాలో చికిత్స అందిస్తున్నారనే విమర్శలు ఆర్మూర్ మండలంలో తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రథమ చికిత్సకే పరిమితం కావాల్సిన కేంద్రాలు అనధికార ఆసుపత్రులుగా వ్యక్తమవుతోంది. మారుతున్నాయనే ఆందోళనఆర్మూర్ మండలం లో దాదాపు 50 మందికి పైగా ఆర్ఎంపీ పిఎంపి లు ఉన్నట్లు సమాచారం. వీరిలో కొందరు మాత్రమే మారుమూల గ్రామాల్లో ఉదయం, సాయంత్రం తిరుగుతూ క్లినిక్ కే ఇల్లుగా మార్చారు ? ప్రజలకు ప్రాథమిక చికిత్స అందిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే పలువురు ఆర్ఎంపీ పిఎంపి లు ప్రత్యేకంగా క్లినిక్లను ఏర్పాటు చేసుకుని వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.పరిధి దాటి 'కార్పొరేట్' వైద్యంఆర్మూర్ మండల పరిధిలో పలువురు ఆర్ఎంపీ పిఎంపి లు నిబంధనలను ఉల్లంఘిస్తూ తమ పరిధికి మించి వైద్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సాధారణ జ్వరం, జలుబు, ఒళ్లు నొప్పులు వంటి సమస్యలతో వచ్చే రోగుల నుంచి ఓపీ ఫీజుల పేరుతో వందల రూపాయలు వసూలు చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.కొన్ని క్లినిక్లలో అనధికారికంగా బెడ్లు ఏర్పాటు చేసి, రోగులకు సెలైన్లు ఎక్కించడం, ఐవీ క్యాన్యులాలు ఏర్పాటు చేయడం, వివిధ రకాల ఇంజెక్షన్లు ఇవ్వడం వంటి చికిత్సలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రథమ చికిత్స అందించిన అనంతరం అవసరమైతే పీహెచ్సీ లేదా సంబంధిత ఆసుపత్రికి రిఫర్ చేయాల్సి ఉండగా, కొందరు ఆర్ఎంపీ పిఎంపి లు తమ పరిధిని దాటి చికిత్స అందిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్లినిక్లలోనే ఫార్మసీలు.. ప్రిస్క్రిప్షన్ల దందా!కొన్ని ఫస్ట్ ఎయిడ్ కేంద్రాల్లోనే మందుల దుకాణాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎంబీబీఎస్ వైద్యుల తరహాలో సొంత లెటర్హెడ్లపై ప్రిస్క్రిప్షన్లు రాస్తూ, తమ వద్దే మందులను విక్రయిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. రోగి ఆరోగ్య పరిస్థితిని పూర్తిగా అంచనా వేయకుండానే వివిధ మందులు, యాంటీబయాటిక్స్ వినియోగించడం వల్ల అనారోగ్య సమస్యలు మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా చికిత్స చేయడం వల్ల రోగుల ఆరోగ్యానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అధికారుల తనిఖీలు ఎక్కడ?ఆర్మూర్ మండలం లో నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్ లు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ సంబంధిత వైద్యారోగ్య శాఖ అధికారులు, స్థానిక పీహెచ్సీ వైద్యాధికారులు తగిన స్థాయిలో తనిఖీలు నిర్వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఈ అంశంపై అధికారులు వెంటనే స్పందించి మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్లపై తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. అర్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు, అనుమతులు లేకుండా మందులు విక్రయిస్తున్నట్లు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా కోరుతున్నారు. తనిఖీలు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATEHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLA-BELLY MANDALAM, WARANGAL DIST-506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATEHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST-506349. TELANGANA STATE, TITEL-code: RNI NUMBER; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com